www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 జులై 2023
5
అన్నమయ్య



బంగారు అమ్మకాల్లో జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎవరైనా కొత్త వ్యక్తులు బంగారు అమ్ముతామని వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ నాగేశ్వర రావు సూచించారు. బుధవారం స్థానిక శ్రీ సత్యలక్ష్మి కల్యాణ మండపంలో నగల దుకాణ యజమానులు, బంగారు నగల తయారీ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా యాసిడ్ దారులు జరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్క యాసిడ్ విక్రయదారుడు లాగ్‌బుక్ రిజిస్టర్ మెయిన్‌టైన్ చేయాలన్నారు. రిజిస్టర్‌లో యాసిడ్ తీసుకున్న వ్యక్తి వివరాలు, చిరునామా, సెల్ నెంబరు, ఆధార్ కార్డు, ఐడి కార్డు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కన్సన్ట్రేషన్ యాసిడ్‌ను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకూడదని సూచించారు. అలాగే స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ల్యాబ్‌లను పరిశీలించి, యాసిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్స్‌కు సూచించారు. అలాగే బంగారు షాపులకు ఎవరైనా కొత్త వ్యక్తులు బంగారు అమ్ముతామని గానీ, బంగారు కరిగించమని గానీ వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణమూర్తి, స్వర్ణకారుల సంఘం నాయకులు కువైట్ శంకరాచారి, శాంతాచారి, మస్తాన్ ఆచారి, క్రిష్ణమోహన్, దుకాణ యజమానులు శివ, రెడ్డెప్ప, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్ భర్తీలో నిబంధనలు అమలయ్యేనా?

రేపటి నుంచి 313 పోస్టులకు కౌన్సెలింగ్
ముందస్తు ప్రకటన విడుదలలో వైఫల్యం
గైడ్‌లెన్స్ అమల్లో చిత్తశుద్ధి కరువు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ కార్యాలయం స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయడంలో నిబంధనల్ని అమలు చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా 313 స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌డి కార్యాలయం స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి వారం రోజులు ముందుగా పోస్టుల భర్తీ ప్రకటన విడుదల చేయడం మొదలుకుని ఖాళీల వివరాలతో కూడిన ప్రకటనను విడుదల చేయాల్సి ఉంది. అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సి ఉంటుంది. చివరగా మెరిట్ మార్కుల ఆధారంగా పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇటువంటి నిబంధనల్ని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ కార్యాలయం విస్మరించిందనే ఆరోపణలు ముప్పిరిగొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజియన్ పరిధిలో స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21, 22వ తేదీల్లో 313 స్టాఫ్‌నర్సు పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ సందర్భంగా 11,120 దరఖాస్తులు చేసుకున్న సంగతి సంగతి తెలిసిందే. 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. తాజా స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ చేయనున్న సందర్భంగా అప్పటి దరఖాస్తుల్లో మెరిట్స్ ఆధారంగా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ సందర్భంగా పదుల సంఖ్యలో బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూసిన సంగతి తెలిసిందే. తాజా స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్ సందర్భంగా పదుల సంఖ్యలో ఉన్న దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉరుముతోంది. స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రకటన అంశాన్ని వారం రోజులు ముందుగా విడుదల చేయాల్సి ఉన్నట్లు సమాచారం. ఇటువంటి నిబంధనల ఆధారంగా ఆర్‌డి కార్యాలయం పరిధిలోని ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన వేలాది మంది నిరుద్యోగులు కౌన్సెలింగ్ ఉందనే విషయం తెలిసే అవకాశం ఉండేది. అర్హులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం ఉండేది. కౌన్సెలింగ్ సమాచారం తెలుసుకున్న నిరుద్యోగులు సకాలంలో కౌన్సిలింగ్‌కు చేరుకునేందుకు అవకాశం ఉండేదనే వాదన వినిపిస్తోంది. కౌన్సెలింగ్‌కు 24 గంటల ముందు ఖాళీల ప్రకటన జాబితాను విడుదల చేయాలి. దరఖాస్తుదారులు తమకు గల ఉద్యోగ అవకాశాలను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. ఇటు వంటి నిబంధనల్ని గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా రిక్రూట్‌మెంట్ చేయడంపై ఉద్యోగ సంఘాలు, ఉద్యోగార్థుల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది.

'చేనేత'కు చేయూత కరువు

జిఎస్‌టి భారం తగ్గింపులో కేంద్రం చిన్నచూపు
ఆందోళనలో చేనేత కార్మికులు



ప్రజాశక్తి-యంత్రాంగం

రెక్కాడినా డొక్కాడని చేనేతన్నకు కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తున్న పన్నుపోటు భారంగా మారింది. నిత్య సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగంపై 5 శాతం జిఎస్‌టి భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూవస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి 5 శాతం జిఎస్‌టిని చేనేతపై విధించింది. నాటి నుంచి జిఎస్‌టి తొలగించాలని చేనేత కార్మికులు, సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దొంగదెబ్బ కొట్టింది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను జిఎస్‌టి నుంచి మినహాయించి కార్మికులను ఆదుకోవాలని పదేపదే ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెడుతూవస్తోంది. చేనేతను ఇంత నిర్లక్ష్యం చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై జిఎస్‌టిని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. దీనిపై చేనేత కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలని, లేదంటే మూల్యం చెల్లించకతప్పదని కార్మికులు హెచ్చరిస్తున్నారు. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని పలురువు కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

చేనేతలపై భారం తగ్గించాలి



మోడీ సర్కార్ ఆది నుంచి కార్పొరేట్లకు కొమ్ముకాస్తోంది. చాలా సంవత్సరాలుగా పట్టుపై జిఎస్‌టిని మినహాయించాలని డిమాండు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. కేంద్రం కేవలం గుజరాత్ జరీ పరిశ్రమ రక్షణ కోసం జిఎస్‌టిని 12 శాతం నుంచి ఏకంగా 5 శాతానికి తగ్గించింది. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలి. చేనేతలకు భారం తగ్గించాలి.

- గంజి మధు, చేనేత కార్మికుడు, బద్వేలు.

నిర్లక్ష్యానికి గురిచేయడం తగదు



ప్రభుత్వం చేనేత పరిశ్రమను నిర్లక్ష్యానికి గురిచేసే ప్రయత్నాలు మానుకోవాలి. జిఎస్‌టి నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను మినహాయించి కార్మికులను ఆదుకోవాలి. జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలి.

- ఎం.వెంకటేశ్వర్లు, చేనేత కార్మికుడు, మైదుకూరు.

చేనేతపై జిఎస్‌టిని తొలగించాలి



చేనేతపై 5 శాతంగా ఉన్న జిఎస్‌టిని రద్దు చేయాలి. జిఎస్‌టిని తొలగించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలి. చేనేత మగ్గంపై తయారు చేసే బట్టలకు, మిల్లులలో తయారు చేసే బట్టలకు చాలా వ్యత్యాసం ఉందని ప్రభుత్వం గమనించి చేనేత కార్మికుల కష్టాలను గుర్తించాలి.

- పి.రమేష్ బాబు, చేనేత కార్మికుడు, మైదుకూరు.

కార్మికుల కడుపు కొట్టొద్దు



కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై వేంటనే జిఎస్‌టినిఇ తగ్గించాలి. గుజరాత్‌లో వస్త్రాలపై జిఎస్‌టి తగ్గించి ఇతర ప్రాంతాల్లో చేనేత కార్మికులనేసే వస్త్రాలకు జిఎస్‌టి తగ్గించకుండా కడుపు కొట్టడం దుర్మార్గమైన చర్య. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి 2017లో జిఎస్‌టి తగ్గిస్తామంటూ మాటలు చెప్పి తగ్గించకుండా చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది.

- కె.శాంతమ్మ, చేనేత కార్మికురాలు, రాయచోటి.

జిఎస్‌టి భారంగా ఉంది



చేనేత రంగంలో కార్పొరేట్ రంగ జోక్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారించాలి. చేనేతపై జిఎస్‌టి ఎత్తివేసి చేనేత కార్మికులను ఆదుకోవాలి. సామాన్యుల చేనేత కార్మికులపై జిఎస్‌టి అనే ఒక పెనుభూతాన్ని మోపడం కేంద్ర ప్రభుత్వానికి తగదు. చిన్నచిన్న చేనేత కార్మికులు పూట గడవడం కోసం కులవృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్నారు.

- బొమ్మిశెట్టి జయచంద్ర, చేనేత కార్మికుడు, వల్లూరు.

పన్నులు ఎత్తేసి న్యాయం చేయాలి



చేనేతలపై కేంద్రం విధించే పన్నులను ఎత్తేసి న్యాయం చేయాలి. పవర్ లూమ్స్, హ్యాండ్ లూమ్స్ వేర్వేరు వాటిని ఒకేలా చూపడం వలన నష్టపోతున్నాం. చేనేతలతో విచారణ జరిపి న్యాయం చేయాలి.

- సంజీవ రాయుడు, చేనేత కార్మికుడు, మైలవరం.


చేనేతలను మోసగిస్తున్న కేంద్రం



ప్రజల మాన ప్రాణాలను కాపాడేవి దుస్తులు. అలాంటి దుస్తులను నేసే మాపై కేంద్ర ప్రభుత్వం అనేక రకాల పన్నులతో నిలువునా మోసం చేయడం తగదు. ప్రభుత్వాలు పన్నులను తగ్గించి, మా ప్రాణాలు కాపాడేలా నిర్ణయాలు తీసుకోవాలి.

- ముని కుమార్, చేనేత కార్మికుడు, జమ్మలమడుగు.

చేనేతలపై కేంద్రం దొంగప్రేమ



చేనేతలపై కేంద్ర ప్రేమ చూపిస్తూ కార్పొరేట్ల కొమ్ము కాస్తుందని అన్నారు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు నూలు,పట్టు రంగులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తేసి చేనేతను ఆదుకోవాలని కోరారు

- కనకరాజు, చేనేత కార్మికుడు, ప్రొద్దుటూరు.

పట్టు, నూలుపై జిఎస్‌టి తగ్గించాలి



చేనేత రంగంపై ఉన్న ఐదు శాతం జిఎస్‌టిని తగ్గించాలి. చేనేతల కోరుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి చేనేత కడుపు కొడుతోంది. చేసిన పనికి సరైన కూలి దొరకక చేనేతలు కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తుస్తోంది.

- వెంకట రాముడు, చేనేత కార్మికుడు, ప్రొద్దుటూరు.



ప్రచారం నిర్వహిస్తున్న ఉర్దూ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ఉపాధ్యాయులు

మైనార్టీ గురుకులంలో విద్యార్థులకు మెరుగైన విద్య

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని తరిగొండ రోడ్డులో ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నారని, ఇక్కడ విద్యను అభ్యసించే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. బుధవారం స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మంజుల సూచనల మేరకు ఉపాధ్యాయులు అడ్మిషన్ల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక కృషితో 2003లో ఈ గురుకుల పాఠశాలను ప్రారంభించడం జరిగిందని, ఈ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య, మెరుగైన పౌష్టికాహారం అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రంలోనే సిబిఎస్ఇ సెంట్రల్ సిలబస్ అమలులో ఉన్న తొలి మైనార్టీ గురుకుల పాఠశాలగా ఈ పాఠశాల గుర్తింపు పొందిందని, ఈ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నప్పటికీ ఉర్దూను ఫస్ట్ లాంగ్వేజ్‌గా బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతిలో ఎలాంటి ఎంట్రన్స్ టెస్ట్, రుసుములు లేకుండా ఉచితంగా అడ్మిషన్లు చేపడుతున్నారని, ఇక్కడ చేరే విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజన సదుపాయాలు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తల్లితండ్రులు 5వ తరగతి విద్యాభ్యాసం కోసం తమ పిల్లలను ఈ గురుకుల పాఠశాలలో చేర్పించాలని, మరిన్ని వివరాల కోసం ప్రిన్సిపల్ మంజుల, 9866559649 మొబైల్ నెంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, విశ్రాంత హెచ్ఎం జవాద్ హుస్సేన్ సాహెబ్, ఉపాధ్యాయులు జిలాని, సయ్యద్ ఆజం, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఊమెన్ చాందీ మృతి పార్టీకి తీరనిలోటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతి పార్టీకి తీరని లోటని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం బెంగళూరు బస్టాండులోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద ఊమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి, అనంతరం రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి, ఊమెన్ చాందీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తూ వారి సేవలను స్మరించుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ ఊమెన్ చాందీ కేరళకు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, 12 సార్లు ఎమ్మెల్యేగా సేవలు అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొన్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. ఊమెన్ చాందీ నిరం తరం ప్రజా శ్రేయస్సు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేయడం జరి గిందని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మదనపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, ఖాదర్‌బాషా, మహబూబ్ పీర్, జీవన్‌కుమార్, బక్షు, మహమ్మద్, ఖాసీం పాల్గొన్నారు.



ఊమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థుల నమోదు వంద శాతం పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రామాపురం/రాయచోటి టౌన్

విద్యార్థుల గ్లాస్ ఎన్‌రోల్‌మెంట్ రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కుమ్మరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, రాయచోటి పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెండింగ్ ఉండడంపై పాఠశాల హెచ్ఎంను, సంబంధిత వాలంటీర్లను, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, పాఠశాల సిబ్బందిని కారణాలను అడిగారు. ఎన్రోల్మెంట్ రేషియో పెండింగ్ ఉండటంపై సరైన కారణాలు చెప్పలేకపో వడంతో అధికారులు, సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌రోల్‌మెంట్ రేషియోను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన వందశాతం విద్యార్థులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ జరగాలని తెలిపారు. జీరో డ్రాప్ అవుట్స్ ఉండాదని అధికారులకు సూచించారు. తరగతి వారీగా ఎన్‌రోల్‌మెంట్‌పై సంబంధిత ఎంఇఒలు, మండల ప్రత్యేక అధికారులు పాఠశాల వారీగా విచారణ చేయాలన్నారు. పాఠశాలలో చేరని వారిని గుర్తించి తిరిగి వారిని పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ ప్లే స్కూల్ నుంచి ఒకటవ తరగతిలోకి, 6, 8, 10వ తరగతిలో పూర్తిగా జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పదవ తరగతి ఫెయి లైన వారందరినీ తిరిగి పదిలో చేర్పించి ఎన్రోల్ చేయాలన్నారు. ఆ విధంగా చేయడం వల్ల వారికి అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజన పథకం తదితరాలు వర్తిస్తాయని చెప్పారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రిజిస్ట్రేషన్ ను పక్కా సమాచారంతో వందశాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రణాళి కాబద్ధంగా కార్యాచరణను రూపొందించుకొని గ్రాస్ ఎన్రోల్మెంట్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప డిఇఒ ప్రసాద్ బాబు, డిప్యూటి డిఇఒ వరలక్ష్మి, కుమ్మరపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, రామాపురం మండల విద్యాధికారుల రామకృష్ణుడు, కృష్ణమూర్తి, పాఠశాల సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలకు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలి : సిఐటియు



మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చిన్నమండెం, సంబేపల్లి మండల అంగన్వాడీ వర్కర్లకు గ్యాస్ స్టవ్‌లు ఇచ్చి సిలిండర్లు ఇవ్వకపోతే పిల్లలకు, గర్భిణీలకు అన్నం ఎలావండి పెడతారని అధికార యంత్రాంగాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రశ్నించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో రాయచోటి ప్రాజెక్టు కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షులు వి.సిద్దమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రాజెక్టులోని వివిధ సెక్టార్లలోని అంగన్వాడీ వర్కర్ల హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యల మీద చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను ప్రైవేటీకరణ చేసే దిశలో భాగంగానే బడ్జెట్‌లో నిధులు తగ్గించాయన్నారు. కొత్త అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వర్కర్లకు వేతనాలు పనిముట్లు పరికరాలు ఇవ్వకపోవడం పిల్లలకు నాణ్యమైన ఫీడ్ ఇవ్వడం లేదన్నారు. ఐసిడిఎస్ పటిష్ట అమలుకు క్రియా శీలక పోరాటాలు చేయాలన్నారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేవపట్ల శెట్టిపల్లి సెక్టార్ల వర్కర్లకు హెల్పర్లకు మినీ వర్కర్లకు 2022 అక్టోబర్ జీతం ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. సిఎఫ్ఎంఎస్ పేరుతో 90 మంది వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న జీతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ 27, 28న మండల కేంద్రాల్లో 31న ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని ప్రాజెక్టు కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చేపట్టే ఆందోళన కార్యక్ర మాలను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ మండల సెక్టార్ నాయకులు నాగమణి, విజయ అరుణ, సుమలత, శంకరమ్మ షబీనా, పీరమ్మ, రమణమ్మ, శైలజ, రెడ్డెమ్మ, అంజలి, జలజ ఉమా శ్రీదేవి, కవిత, కళావతి, జయ, పద్మజ షబానా, మాధవరం పద్మజ పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం

- పురుగు మందు డబ్బాతో బాధితుల నిరసన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాసులు ఇచ్చిన వారికి న్యాయం చేసేందుకు అమాయకులైన ఓ రైతును అనేక రకాలుగా ఇబ్బందుల పాలు చేస్తూ రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలు అధికార దుర్విని యోగానికి పాల్పడుతున్న దౌర్జన్యకాండ మండల పరిధిలోని హెచ్.చెర్లోపల్లి హస్తవరంలో చోటు చేసుకుంది. నిరక్షరాస్యుడైన ఆ పేద రైతు అధికార బలానికి నిలువలేక మరణమే శరణ్యం అంటూ భార్యతో కలిసి బుధవారం పురుగుల మందు తాగేందుకు సిద్ధపడ్డాడు. వివరాల్లోకి వెళితే... చెర్లోపల్లికు చెందిన బసిన బోయిన సుబ్బయ్య, యానాదమ్మ దంపతులు తమ గ్రామంలోనే 357, 358, 359 సర్వే నెంబర్లలో 25 ఏళ్లుగా ఐదు ఎకరాల పట్టా భూమిని సాగు చేసుకుంటున్నారు. వీరి భూమి వెనుకనే అదే గ్రామానికి చెందిన బసిన బోయిన వెంకటయ్యకు చెందిన భూమి ఉంది. తన పొలానికి దారి కోసం సుబ్బయ్య కుటుంబంపై అధికారుల అండతో



నిరసన తెలుపుతున్న సుబ్బయ్య దంపతులు

ఒత్తిడి తీసుకురావడంతో వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో రాజంపేట రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం వరకు సుబ్బయ్యను విచారణ నిమిత్తం పోలీసుస్టేషన్‌లో ఉంచి సాయంత్రం ఇంటికి పంపించారని, తిరిగి ఇంటికి వచ్చే సమయానికి తన పొలం నుంచి వెంకటయ్య పొలానికి దారి నిర్మించారని, ఇదంతా రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు అధికారుల అండతో వెంకటయ్య చేశాడని బాధితుడు సుబ్బయ్య ఆరోపిస్తున్నాడు. విద్యుత్ శాఖ అధికారులు గతంలో తన పేరిట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ నిర్మించి రాజకీయ ఒత్తిడితో నేటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా కావాలంటే వెంకటయ్య పొలానికి దారి ఇవ్వాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. భూ వివాదం కోర్టులో ఉందని, కోర్టు ఉత్తర్వులు కూడా లెక్కచేయకుండా అధికారుల అండదండలతో వెంకటయ్య అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తమపై దౌర్జన్యానికి పాల్పడిన వీడియోలను, ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు సైతం ధ్వంసం చేశారని తెలిపారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ సుబ్బయ్య దంపతులు తమ పొలంలో పురుగుల మందు డబ్బా తీసుకొని బోరుమని విలపించారు. ఇదే విషయమై సుబ్బయ్య దంపతులు బుధవారం డిఎస్‌పి విఎన్‌కె చైతన్యకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించి డిఎస్‌పి చైతన్య పోలీస్, రెవెన్యూ అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపి సిసి కెమెరాలను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కేసును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

గ్రామ పంచాయతీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- డిసిసి మైనార్టీ చైర్మన్ మన్సూర్ అలీఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గత కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు ఎంతో అభివృద్ధి చెంది కళకల్లాడాయని, ప్రస్తుతం బిజెపి పాలనలో గ్రామాల అభివృద్ధి 20 ఏళు వెనక్కి వెళవెళబోతున్నాయని డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. తాగడానికి నీరు, నడవడానికి సిమెంట్ రోడ్లు, మురికి నీరు వెళ్లడానికి కాలువలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనారోగ్యం పాలు అవుతున్నారన్నారు. మండలంలోని చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సపుర మసీదు, మహబూబ్నగర్ ప్రాంతంలోని పలువీధుల్లో బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నేతలతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త రోడ్డులో నిలుచుని అధికారుల తీరుపై కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. స్థానిక ప్రజలు గ్రామ పంచాయతీ అధికారుల, అధికార పార్టీ నాయకుల ఎదుటఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సపూర మసీదు, మహబూబ్నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. రోడ్లన్నీ గుంతలమయం ఇక వర్షం వస్తేఅడుగుతీసిఅడుగువేయలేరు. రోడ్లపై నీరు నిలిచి విషపురుగులు, పాములు వస్తున్నాయని, మున్సిపాలిటీ, పంచాయతీ వారు చెత్త చదారాన్ని ప్రతిరోజు తీయకపోవడం వల్ల నిల్వ ఉండి చుట్టుపక్కల నివసిస్తున్న వారు అనారోగ్యం పాలు అవుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, నాయకుల వైఫల్యంతో పలు వీధులు అధ్వానంగా తయారయ్యాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాలనీలో రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కర్ణాటకలో విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని 2024లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. రాహుల్ గాంధీ పాలనలో గ్రామాలకు మరిన్ని ప్రత్యేక నిధులు ఇచ్చి అభివ ృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షుడు శర్వాణి ఫారుక్, జిల్లా మైనార్టీ సెక్రటరీ యహియాబాష, పట్టణ యువజన నాయకుడు ఫయాజ్ భాష, మన్సూర్ విక్టోరియాస్, ఆఫీజుల్లా కాంగ్రెస్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి ఎస్‌టి రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకి/బోయల ఎస్‌టి రిజర్వేషన్ బిల్లు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పోదల నరసింహులు, వీఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ సంయుక్తంగా డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుండి జరగబోవు పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకి బోయల ఎస్టీ హోదా బిల్లును ఆమోదించాలని కోరుతూ సంబంధిత కేంద్ర మంత్రులను, అధికారులను, కలసి ఒత్తిడి చేయడంతోపాటు తమ జాతికి జరుగుతున్న అన్యాయాలను, గతంలో పెద్దలు వాల్మీకి నాయకులు చేసిన ఉద్యమాలను మరియు ప్రస్తుతం వాల్మీకి బిడ్డలు చేస్తున్న పోరాటాలను వారి ద ృష్టికి తీసుకెళ్లడం జరుగు తుందన్నారు.ఇందులో భాగంగా ఈ నెల 20, 21, 22, 23వ తేదీ వరకు ఢిల్లీలోనే ఉండి ఈ పార్లమెంట్ సమావేశాలు పూర్తయ్యేలోపు ఖచ్చితంగా ఎస్‌టి హోదా బిల్లు అమోదించి వాల్మీకులకు న్యాయం చేయాల్సిందేనని తెలిపారు. గతంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం, వాల్మీకులకు చేసిన ద్రోహం తదితర విషయాలు తెలియజేస్తూ వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పోదల నరసింహులు వాల్మీకి సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడంతోపాటు తమ వాణిని ఢిల్లీలో బలంగా వినిపించారు. కార్యక్రమంలో విఆర్ఎస్ఎస్, విఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డిఎల్‌డిఒ

మెరుగైన సేవలందించాలి : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గ్రామ సచివాలయాల నుంచి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని డిఎల్‌డిఒ లక్ష్మీపతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామ సచివాలయాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచులు సుబ్రమణ్యం, రెడ్డమ్మ నరేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారప్ప సచివాలయ కార్యాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డిఎల్‌డిఒకు వివరించారు. అనంతరం వారు ఉద్యోగుల హాజరు పట్టికను, పలు రికార్డులను, మూమెంట్ రిజిస్టర్‌లను, ప్రభుత్వ పథకాల అర్హుల, అనర్హుల జాబితాలను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న పలు సర్వేల అమలు పై ఆరా తీశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున గ్రామాలలో బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకో వాలని అన్నారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో సర్వేను పకడ్బందీగా నిర్వహిం చాలని వాలంటీర్లకు సూచించారు. ప్రతి విద్యార్థి చదువుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఫీవర్ సర్వేను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎఎన్ఎంలకు సూచించారు. గ్రామ సచివాలయాల్లో అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉన్నారని, సమయపాలన పాటిస్తూ మరింతగా సేవలను అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని తెలిపారు. రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి సచివాలయాల నిర్వహణ, ఉద్యోగుల పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, రెడ్డమ్మ నరేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారప్ప, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-నందలూరు

రీజెన్సీ నలంద విద్యాసంస్థల చైర్మన్ డా.జి.యన్.నాయుడు అధ్వర్యంలో బుధవారం నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న సౌమ్యనాథ సేవ ట్రస్ట్ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం గొప్పదని, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం హర్షణీయమని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కో-అర్డినేటర్ బి.వి.నరసయ్య, ప్రధానోపాధ్యాయుడు డి.మురళి , విద్యాసంస్థల మేనేజర్ జి.చందు పాల్గొన్నారు.

వీరబల్లి తహశీల్దార్‌గా మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి



బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్‌రెడ్డి

మండల తహశీల్దార్‌గా బుధవారం బొమ్మవరం మహేశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న తులసమ్మ రాజంపేట రెవెన్యూ ఆఫీసుకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తూ బదిలీపై వీరబల్లి తహశీల్దార్‌గా వచ్చి నట్లు ఆయన తెలి పారు. ఈ సందర్భంగా మండల విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరించుటకు తమ వంతు కృషి చేస్తానన్నారు మండల స్థాయి ప్రజా ప్రతినిదులు, వివిధ పార్టీ నాయకులు, ప్రజలు, తమకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు.



జాతర నిర్వాహకులకు విరాళాన్ని అందిస్తున్న శివరామరాజు

జాతరకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బలిజిపల్లె గంగమ్మ జాతరకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఎల్లటూరు శ్రీనివాసరాజు జాతర నిర్వహణకు రూ.లక్ష విరాళాన్ని అందించారు. శ్రీనివాసరాజు సోదరుడు శివరామరాజు చేతుల మీదుగా ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు అందించారు. 200 సంవత్సరాలు చరిత్ర కలిగిన బలిజిపల్లె గంగమ్మ జాతర ఈ ఏడాది వివాదాలతో ఆలస్యమైనప్పటికీ నిర్వాహకులు జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారి జాతర నిర్వహణలో విరాళం రూపంలో తాను భాగ స్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

'యాప్' వినియోగంలో ఐదవ స్థానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టీం జగనన్న యాప్ వినియోగంలో తంబళ్లపల్లె నియోజకవర్గం 5వ స్థానం నిలువగా టీం జగనన్నలో బెస్ట్ ఫెర్ఫామర్స్ కింద ముగ్గురు ఎంపికైనట్లు టీం జగనన్న బృందం తెలిపింది. వీరిలో మండలంలోని బడికాయలపల్లి, గట్టు పంచాయతీకి చెందిన శివశంకర్ మొదటి స్థానం, కురబలకోట మండలానికి చెందిన రామిగాని శంకర్ రెండవ స్థానం, గట్టు పంచాయతీకి చెందిన సుబ్రహ్మణ్యం మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎంపికయిన వారికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల కంటే అధికంగా సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే టీమ్ జగనన్న యాప్ ద్వారా సోషల్ మీడియాలో చురుకుగా ఉన్నవారిని సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బోయవీధి మంజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు



దుకాణంలో తనిఖీ చేస్తున్న మెట్రాలజీ అధికారి రవీంద్రారెడ్డి

పట్టణంలోని పలు దుకాణాల్లో కడప తూనికలు కొలతల సహాయ నియంత్రణాధికారి కె.జె. రవీంద్రారెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహిఁచారు. బుధవారం ఆయన స్థానిక కిరాణా దుకాణాలు, బియ్యం, నూనె దుకా ణాలు, సూపర్ మార్కెట్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె ప్యాకెట్లు, ఇతర వస్తువుల బరువులను పరిశీలించామని, బియ్యం పాకెట్ల నిఖర బరువు 25 కేజీలకన్నా తక్కువ ఉండటంతో ఐదు కేసులు నమోదుచేసి, వారి నుంచి రాజీ రుసుంగా రూ.1.5లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు.

యాసిడ్ తయారీదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మదనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

పట్టణంలోని యాసిడ్ తయారీదారులు, విక్రయదారులు చట్టపరమైన నిబంధనలు పాటించాలని డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. బుధవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యాసిడ్ దాడులు జరుగుతున్న సందర్భంగా యాసిడ్ తయారీ దారులు, విక్రయదారులకు సంబంధించి పట్టణంలోని కళాశాలల ల్యాబోరేటరీ అధ్యాపకులకు ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు పలు సూచనలు తెలిపారు. యాసిడ్ తయారీదారులు కానీ, అమ్మక దారులు గానీ రిజిష్టర్ పుస్తకంలో యాసిడ్ తీసుకునే వారి చిరునామా, ఫోన్‌నంబరు, ఆధార్‌కార్డు ఐడి తప్పనిసరిగా రిజిష్టర్‌లో నమోదు చేయా లని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే యాసిడ్ విక్రయించాలని, గాఢత ఎక్కువగా ఉండే యాసిడ్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఎవ్వరికీ అమ్మ రాదని, యాసిడ్ ఫ్యాక్టరీ నందు తయారీదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు కూడా తమ ల్యాబ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి ఎవరికైనా అక్రమంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో టూటౌన్ సిఐ ఎస్.మురళీ కృష్ణ, తాలూకా సిఐ సత్యనారాయణ, వన్‌టౌన్ సిఐ యస్.మహబూబ్‌బాషా, టూటౌన్ ఎస్ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** ప్రజలకు హానికలిగించే యాసిడ్ అమ్మకాలను నియంత్రించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక దుకాణదారులతో పోలీస్ స్టేషన్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అధిక ప్రభావం కలిగిన, ప్రజలకు హాని కలిగించే యాసిడ్ అమ్మకాలను, సరఫరాను నియం త్రి చాలని సూచించారు. తక్కువ ప్రభావం కలిగిన, శానిటేషన్‌కు ఉపయోగపడే యాసిడ్‌ను మాత్రమే విక్రయించాలన్నారు. **రాజంపేట అర్బన్ :** అనుమతి లేకుండా దుకాణదారులు యాసిడ్ విక్రయాలు జరిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి విఎన్‌కె చైతన్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసిడ్ విక్రయాలు జరిపేటప్పుడు వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలలో ఉన్నటువంటి కళాశాలలకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పట్టణ సిఐ నరసింహారావు, రూరల్ సిఐ పుల్లయ్య, ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి : 'కొరముట్ల'



రైల్వేకోడూరు : మహిళకు రేషన్‌కార్డును అందిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని గ్రామ సచివాలయం-3 నందు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ద్వారానే సుమారు రూ.25కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందని, కేవలం రైల్వే కోడూరు పట్టణంలో రూ.117 కోట్ల రూపాయలు అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పీడిత ప్రజల హక్కుల కోసం ఎన్నో దశాబ్దాలుగా పోరాటాలు జరిగాయని అన్నారు. ప్రతి మహిళకు అమ్మఒడి మొదలు పలు సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని, అన్ని రకాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం జగన్‌కు మరోమారు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి, ధ్వజరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోటశివ సాయి, ఎపిటూరిజం డైరెక్టర్ నాగేంద్ర, జడ్‌పిటిసి రత్నమ్మ, తహశీల్దార్ రామ్మోహన్, కన్వీనర్ రమేష్, సర్పంచ్ శివయ్య, మండల శివయ్య, వార్డు సభ్యులు వినోద్‌కన్నా, ప్రసాద్, రామచంద్రయ్య, శంకరయ్య, కరీముల్లా, నందాబాల, సుబ్బరాయుడు, ఫరూక్, ఆజాద్, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మండలంలోని కొత్త ఇండ్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ అసియాబేగం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఉదయ్ కుమార్, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపిటిసి అమీరున్నీసా, కో-ఆప్షన్ మెంబర్ ఇస్మాయిల్, వైసిపి నాయకులు ఇర్ఫాన్, సుబ్బయ్య, పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి : టిడిపి

ప్రజాశక్తి-కలికిరి



లక్కిరెడ్డిపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ఓటర్ జాబితా పై నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో బూత్‌కమిటీ మెంబర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలకు ఓటర్ జాబితా పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తారుమారు, దొంగ ఓట్ల ప్రయత్నాలతో వైసిపి పతనం ఖాయమని, ఎన్నికల్లో వైసిపి దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి విజయం సాధించేలా నాయకులు, కార్య కర్తలు పనిచేయాలన్నారు. ఇందుకోసం ఓటర్ల జాబి తాను క్షుణ్ణంగా పరిశీ లించి దొంగ ఓట్లను తొలగిం చాలన్నారు. వైసిపి నాయకులు వయస్సు లేని వారిని ఓటర్లుగా చేర్పిం చాలని కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. బూత్ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హులను గుర్తించాలని తెలిపారు .కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపా ధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సీనియర్ నాయకులు నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రారెడ్డి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే లక్ష్యం గా పని చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన నివాసంలో లక్కిరెడ్డి దచీశీఅవగపల్లి, రామాపురం మండల టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి ఆర్‌టి ఎస్, టెలిగ్రామ్ బూత్‌ల పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేది నుంచి ఆగస్టు 21వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి బూత్‌కి వెళ్లి అభ్యంతరాలు ఉన్నచోట బిఎల్ఒలకు పత్రాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, పోల్ కో-ఆర్డినేటర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఎంఇఒ చక్రధర్‌రాజు

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రామసముద్రం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్ పదోన్నతిలో భాగంగా నందలూరు మండలం, నల్లతిమ్మాయిపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా వెళ్లారు. బుధవారం ఉపాధ్యాయులు, ఎంఇఒ చక్రధర్‌రాజు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆయన సతీమణి లావణ్యను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్ టిఎంసి సిబ్బంది, ఎంఆర్‌పిఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాతో రోగాలు దూరం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

వ్యాధి నిరోధక టీకాతో రోగాలను దూరం చేసుకోవచ్చని జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మందలవాండ్లపల్లిలో నిర్వహిస్తున్న 104 క్యాంప్‌ను, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని ఐదేళ్లలోపు లోపు పిల్లలు, గర్భిణులు, మూడు నెలల లోపు ఇంటింటికి వెళ్లి పరిశీలించి ఎంసిహెచ్ కార్డులో నమోదు చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్, జిల్లా సిహెచ్ఒ నారాయణ, డాక్టర్ ఇమ్మానుయేల్, సిహెచ్ఒ కృష్ణయ్య, సూపర్వైజర్ ప్రసన్న కుమారి, రెడ్డి రాణి, ఫార్మాసిట్ సుబ్బమ్మ, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-పుల్లంపేట



ఇరిగిన విద్యుత్ స్తంభం

మండల పరిధిలోని అనంతంపల్లి మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తుతె లియని వాహనం ఢీకొనడంతో స్తంభం రెండు ముక్కలైంది. మలుపు వద్ద ఉన్న కరెంటు స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనగా కరెంటు స్తంభం రెండు ముక్కలుగా విరిగిపడింది. ఇదే విద్యుత్ స్తంభాన్ని రెండు నెలల క్రితం లారీ ఢీకొని రెండు ముక్కలుగా పడిపోయింది. స్థానిక లైన్ మెన్ చంద్ర మోహన్ అప్రమత్తతో ఎటువంటి అపాయం జరగ కుండా, జాతీయ రహదారిపై వాహనాలకు ఎటువంటి అంతరాయం కలగ కుండా చేశారు. స్థానిక లైన్‌మేన్ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక మండలంలో ఖాళీగా ఉన్న మూడు వాలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గుండ్లపల్లి సి15 క్లస్టర్ (జనరల్), దిగువ పాల్యం 16 క్లస్టర్ (జనరల్), కన్యమడుగు (బిసి-ఎ) ఖాళీలు ఉన్నాయన్నారు. ఈనెల 24 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని, 25న స్క్రూటినీ, 26, 27వ తేదీలలో అభ్యర్థులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 28న ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలు జారీ చేస్తామని, 29 ,30 తేదీలలో వాలంటీర్లుగా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ ఉంటుందన్నారు. 31న నియామక పత్రాలను అందిస్తామని ఎంపిడిఒ తెలిపారు. అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యథావిధిగా వేలం పాట నిర్వహించాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డులో యథావిధిగా సాయంత్రం టమోటా వేలం పాటలు నిర్వహించాలని పలువురు రైతులు బుధవారం కార్యదర్శి జగదీష్, సూపర్వైజర్ బాలాజీలకు వినతి పత్రం అందించారు. ములకలచెరువు మార్కెట్‌యార్డ్‌లో టమోటా మండీలు నిర్వహిస్తున్న మండి యాజమాన్యం బహిరంగ వేలం మార్కెట్లో ఉదయం వేలం పాటలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలియడంతో స్థానిక ప్రాంత రైతులు వ్యవ సాయ మార్కెట్ కి చేరుకున్నారు. ఉదయం టమోటా వేలంపాట నిర్వహిస్తే తమకు చాలా నష్టము వాటిల్లుతుందన్నారు. ఉదయం పూట మదనపల్లి, కోలారు, చింతామణి మార్కెట్ రేట్లు గమనించి మేము ఇక్కడ కూలీలను ఏర్పాటు చేసుకొని టమోటాలు కోసి మార్కెట్‌కు తీసుకొని వచ్చి అమ్ముకుంటున్నామని తెలిపారు. పాత పద్ధతిలో సాయంత్రం పూట వేలం నిర్వహిం చుటకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మునీర్, రఘునాథ్ రెడ్డి, రమణ, కృష్ణారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మల్లంవారిపల్లె గ్రామంలో బుధవారం స్పందన ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ పెద్దల సమక్షంలో పేద కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. వారి ఇంటి అవసరాల నిమిత్తం నిత్యావరసర వస్తువులు అందించి వారికి భరోసా కల్పించారు. ట్రస్ట్ తరుపున భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగాఉన్నామని తెలిపారు. స్పందన ట్రస్ట్ వారి పేద కుటుంబాల పట్ల చూపుతున్న ఆదరణ పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

తంబళ్లపల్లె : మండలంలో అమలవుతున్న ఉపాధిహామీ పథకం ద్వారా పండ్లు, పూలతోటలు, పెంచుకునేందుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఎంపిడిఒ సురేంద్రనాథ్ ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారి ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు వారు చేసిన పనులకు కొలతలు తీసి నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో కూలీలు పనిచేసేలా మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిఒ అంజనప్ప, ఉపాధి ఇంజినీర్ రామన్నలు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డిపిఎంఒ డాక్టర్ లోక్‌వర్ధన్

మిషన్ ఇంద్రధనుస్సును విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-కలికిరి

శిశువుల్లో వంద శాతం వ్యాధినిరోదకతను పెంచే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని సమిష్టి కృషితో జయప్రదం చేద్దామని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని మెడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని కురాకులపల్లిలోని డాక్టర్ వైఎస్ ఆర్ విలేజ్ క్లినిక్‌లో నిర్వహి స్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మిషన్ ఇంద్రధనుస్సు పైఆ రోగ్య సిబ్బందికి వైద్యులు కు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఐదు సంవ త్సరాల లోపు, ప్రతి బిడ్డకు, ప్రతి గర్భిణికి ఇప్పటివరకు అందని అన్ని వ్యాధిని రోధక టీకాలను అందేటట్లు చేయడమేనని, ఈ కార్యక్రమము సూక్ష్మ ప్రణాళిక వారిగా ఇంటింటికి తిరిగి ఆశా కార్యకర్తలచే లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. గుర్తించిన బిడ్డలు, గర్భిణులు ఆగస్టు 7, సెప్టెంబర్ 11, అక్టోబర్ 9 వరకు మూడు విడతలుగా, ప్రతి రౌండ్‌కు, ఆరుదినాలు నిర్దేశించిన గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సిహెచ్ఒ, ఎఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, వ్యవసాయ అధికారి కార్యాలయం ఒకే భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వ్యవసాయ సంచాలకుల కార్యాలయ సిబ్బంది 10:40 నిమిషాలు కావస్తున్నప్పటికీ కార్యాలయ తలుపులు తెరవకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలం లోని పలు గ్రామాల నుంచి రైతులు పలు సమస్యలతో కార్యాలయానికి వస్తుంటారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్న ప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై వ్యవసాయ అధికారి ఎం.జయరాణి వివరణ కోరగా కార్యాలయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని, తనకు జిల్లా స్థాయి అధికారులతో సమీక్షలు, పొలంబడి వంటి కార్యక్రమాలకు హాజరవుతుంటానని అన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సిసి అధికారులు

రాజు పాఠశాలలో ఎన్‌సిసి విద్యార్థుల ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని స్థానిక రాజు పాఠశాలలో ఎన్‌సిసి సుబేదార్ హరియందర్ సింగ్, హవాల్దార్ సమయా సింగ్, ఆఫీస్ స్టాఫ్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సిసి ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురామరాజు మాట్లాడుతూ ఎన్‌సిసిలో శిక్షణ పొందడం వలన విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతారని అన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాలలో మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అకాడమిక్ ఇన్‌చార్జి శేషారెడ్డి, ఎఎన్ఒ ఓబుల్‌రాజు, సిటిఒ హరి, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు :'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అరవీడు గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హత కలిగి ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే సమీపంలోని గ్రామసచివాలయాలను సంప్రదించాలని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆదరించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషణ్ రెడ్డి మాజీ వైఎస్ ఎంపిపి రమేష్ కుమార్‌రెడ్డి, నూలివీడు సర్పంచ్ ఉమాపతిరెడ్డి, రమణరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్‌పర్సన్ కృషి అభినందనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ నైనారు మధుబాల చేస్తున్న కృషి అభినందనీయమని గ్రంథాలయాల అధికారులు పేర్కొన్నారు. మదనపల్లి శాఖ గ్రంథాలయ అధికారి ఆర్.వసంతకుమారి, కురబలకోట గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్, బి.కొత్తకోట గ్రంథాలయ అధికారి తులసీనాయక్, వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి రమాపతి, గుర్రంకొండ గ్రంథాలయ అధికారి రెడ్డిరాణిలు బుధవారం పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో మొత్తం 71 గ్రంథాలయాలు ఉన్నాయని వాటి అభివృద్ధికి ఛైర్మన్ ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ ఏడాది మొత్తం 49 గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను విజయవంతంగా నిర్వహించడం వెనుక ఆమె పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, అదనపు సిబ్బంది కోసం ఆమె ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం హర్షణీయమన్నారు. గ్రంథాలయాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన, నూతన గ్రంథాలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయింపునకు ఆమె చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఆమె సూచనలు, సలహాలు మేరకు గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తామని వారు స్పష్టం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారులు